క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ హెచ్ ఎంలకు సూచించారు. గురువారం మండలంలోని మాందాపూర్, చింతకుంట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతం, కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. దీంతో పాటు దసరా సెలవులు ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. సెలవులను ప్రైవేట్ పాఠశాలలు తప్పక పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను విస్మరించే పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీరాములు, నారాయణ, కలమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తోటి విద్యార్థుల దాతృత్వం



ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని అమృతవర్షిణి అనారోగ్యం బారిన పడింది. విద్యార్థిని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో తోటి విద్యార్థులు గురువారం మధ్యాహ్న భోజన సమయంలో రూ.6,500 పొగుచేసి పాఠశాల హెచ్‌ఎం కొండాపురం బాలరాజుకు అందజేశారు. ఉపాధ్యాయులతో కలిసి వనపర్తిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కుటంబసభ్యులకు నగదును అందజేశారు.

ప్రజా నాయకుడు నిరంజన్‌రెడ్డి



పెబ్బేరు రూరల్: ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన సతీమణి, బీఆర్‌ఎస్ మహిళా నేత సింగిరెడ్డి వాసంతి కోరారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్త సూగూరు, సూగూరులో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా వాసంతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల శైలజ, జెడ్పీటీసీ పద్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, సర్పంచ్‌లు వెంకటస్వామి, వెంకటేష్, గోవిందు నాయుడు, రవీందర్‌నాయుడు

ఏఐవైఎఫ్ మహాసభను జయప్రదం చేయండి



ఆత్మకూర్: ఏఐవైఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 29, 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కుతుబ్ కోరారు. గురువారం పట్టణంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ యువతను ప్రగతిశీల, అభ్యుదయ, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామ్య విలువలు పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నరేష్, షరీఫ్, అశోక్, నాగరాజు, శ్రీను ఉన్నారు.

సాగునీరు అందించేందుకు వర్కటం చేయూత



ఆత్మకూర్: వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి దళిత రైతులకు బాసటగా నిలిచారు. పొలాలకు సాగునీరు అందించేందుకు రూ.1.75 లక్షలు వెచ్చించి మోటార్లు, పైపులు, స్టార్టర్లను అందజేసారు. ఆత్మకూర్ మండలంలోని కత్తేపల్లికి చెందిన 20 మంది దళిత రైతులు సాగునీరు అందక పంట సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వర్కటంను సంప్రదించారు. డీ–6 కాల్వ నుంచి సాగునీరు అందించేందుకు సహకరించాలని కోరడంతో గురువారం రూ.1.75 లక్షలు వెచ్చించి రెండు 5 హెచ్‌పీ మోటార్లు, స్టాటర్లు, పైపులను రైతులకు అందజేసారు. కార్యక్రమంలో కుర్మన్న, తిరుపతి, నర్సింహా, అర్జున్, బసన్న, దాసన్న, విష్ణు, కొండన్న, ఎల్లన్న, లక్ష్మన్న, నాగరాజు, గోపాల్, రామకృష్ణ, భాను ఉన్నారు.

చేపపిల్లల లెక్క తప్పుతోంది..



పాన్‌గల్‌లో మత్స్యకారులకు చేపపిల్లలను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

- తక్కువ పరిమాణం, లెక్క తేడాలపై మత్స్యకారుల ఆందోళన
- మండలానికి 12 లక్షలగాను 10.97 లక్షల పంపిణీ

పాన్‌గల్: నిర్దేశిత పరిమాణంతో పాటు అదునుకు చెరువుల్లో చేపపిల్లలు వేస్తేనే అనుకున్న సమయంలో ఎదుగుతాయి. ప్రభుత్వం మత్స్యకారులకు చేప పిల్లలను ఉచితంగా సరఫరా చేస్తున్నా అందులో లోపాలు లక్ష్యాన్ని నీరుగారుస్తున్నాయి. సరఫరాలో 'లెక్క' లేనితనం వల్ల పెంపకందారులకు నష్టం వాటిల్లుతోంది. దీంతో మండల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

మండల పరిస్థితి

మండలంలోని పాన్‌గల్, కేతేపల్లి, కదిరెపాడు, శాగాపూర్, రాయినిపల్లి, దొండాయిపల్లి, గోప్లాపూర్, రేమద్దుల, చిక్కేపల్లి, చింతకుంట, బుసిరెడ్డిపల్లి, మాందాపూర్, జమ్మాపూర్, తెల్లరాళ్లపల్లి, మంగళ్లపల్లి, అన్నారం, మాధరావుపల్లి, బండపల్లి, కిష్టాపూర్ గ్రామ పంచాయతీల్లో మొత్తం 96 చెరువులకు గాను 12 లక్షల చేపపిల్లలు అవసరం ఉండగా.. ఇప్పటికి 10.97 లక్షల చేపపిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అధికారులు పేర్కొన్నారు. అన్నారం, మాధరావుపల్లి, బండపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేకపోవడంతో చేప పిల్లలను పంపిణీ చేయలేదన్నారు.

తక్కువ పరిమాణంపై ఆందోళన

చేపపిల్లల పరిమాణం కనీసం 2.5 లేదా 3 అంగులాల పొడువు ఉండాలి. జల వనరుల్లో అలాంటివి వేస్తే వేసవి వచ్చేసరికి కిలో పైన బరువు వస్తాయని మత్స్యకారులు అంటున్నారు. కానీ మత్స్యశాఖ చిన్న సైజు చేపిల్లలు అందజేస్తోంది. చిన్న సైజు చేప పిల్లలు ఇస్తుండటంతో చేసేందేం లేక మత్స్యకారులు సొంతంగా కొనుగోలు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చెరువు వద్ద లెక్కిస్తే తేడాలు

పంపిణీ చేసే సమయంలో 40 వేలు పిల్లలు అని చెప్పినా అవి 20 నుంచి 30వేల వరకే ఉంటున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఏదిఏమైనా మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను అదునుకు సరఫరా చేయకుండా ఇప్పుడు సరఫరా చేసి మమ్ముల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

లెక్కల్లో తేడాలుండొద్దు



ప్రభుత్వం నాణ్యమైన, పెద్దసైజు చేపపిల్లలు సకాలంలో అందజేయాలి. ఉచితంగా ఇచ్చేవే కదా అని లెక్కల్లో తేడా చూపొద్దు. ఆయా గ్రామాలకు కేటాయించిన లెక్క ప్రకారం చేపపిల్లలను పంపిణీ చేయాలి. దీంతో పాటు వాటి పెంపకంపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలి.

– అంజనేయులు, మత్స్యకారుడు, కేతేపల్లి

పెద్ద సైజువి అందించాలి



ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలు తక్కువ పరిమాణంలో ఉండటంతో ఇబ్బందిగా మారింది. వర్షాకాలం సమయంలో అందిచాల్సిన చేపపిల్లలను సీజన్ ముగిసిన తర్వాత పంపిణీ చేస్తుండటంతో అవి ఎదగడం ఆలస్యం అవుతుంది. దీంతో పాటు అధికారులు మత్స్యకారుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు.

– తాళ్ల సింగోటం, మత్స్యకారుడు, పాన్‌గల్

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే..



మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అందిస్తున్నాం. పంపిణీ సమయంలోనే మత్స్యకారులు సరిగ్గా లెక్క చూసుకొని గ్రామానికి కేటాయించిన లెక్క ప్రకారం చేపపిల్లలను తీసుకోవాలి. ఒక వేళ లెక్క విషయంలో తేడా వస్తే తమ దృష్టికి తీసుకు రావాలి. కొన్ని గ్రామాల చెరువుల్లో నీరు లేకపోవడంతో చేప పంపిణీ చేయలేదు.

– రహమాన్, ఏడీ, మత్స్యశాఖ, వనపర్తి

బాల్యవివాహాలు నిర్మూలించాలి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న న్యాయవాదులు



గుమ్మడంలో..

ఆత్మకూర్: బాల్య వివాహాల వల్ల ఎన్నో రకాల అనర్థాలు జరుగుతాయని, బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ రహిత దేశం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలు ఒకక్లిష్టమైన సమస్యఅని తాము బాధ్యత వహించబోమని, ప్రోత్సహించమని, నిరోధించడానికి కృషి చేస్తామని, బాల్యం సురక్షితంగా, స్వేచ్ఛగా జీవించేందుకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొండాపురం బాలరాజు, మున్సిపల్ వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు దివాన్జీ అశోక్‌కుమార్, జీకే రాములు, ముక్తేశ్వర్, శంకర్‌లింగం, కోర్టుసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికట్టడంపై గురువారం మండలంలోని గుమ్మడం, అయ్యవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను ఎలా ఎదుర్కోవాలి, తల్లిదండ్రులకు ఎలా అవగాహన కల్పించాలి అనే విషయాలపై పారా లీగల్ వలంటీర్ ప్రకాష్, న్యాయవాది శ్రీవర్ధన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

అమరచింత: మండలంలోని మస్తీపురంలో గురువారం అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన శివారెడ్డి, వెంకటేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు చేసి రెండు బెల్టుషాపుల నుంచి ఆరు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా గ్రామాల్లో బెల్టుషాప్‌లు నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరిస్తూ దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

బైండోవర్‌ను అతిక్రమిస్తే చర్యలు

ఖిల్లాఘనపురం: గ్రామాల్లో వివిధ కేసుల్లో నిందితులుగా గుర్తించిన వారికి తహసీల్దార్ విధించిన బైండోవర్‌ను అతిక్రమిస్తే జరిమానా తప్పదని తహసీల్దార్ పాండునాయక్, ఎస్సై శ్రీహరి తెలిపారు. ఇటీవల మండలంలోని రుక్కన్నపల్లికి చెందిన గుజ్జుల వీరయ్య బైండోవర్‌ను అతిక్రమించడంతో గురువారం తహసీల్దార్ పాండునాయక్ రూ.10 వేల జరిమాన విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి తరలింపు



కానాయపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టిని కొత్తకోటకు తరలిస్తున్న ట్రాక్టర్



పాలెం వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

కొత్తకోట రూరల్: ఇసుక, మట్టిని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కానాయపల్లి గుట్ట నుంచి మట్టిని, పాలెం వాగు నుంచి జేసీబీ సహాయంతో ఇసుకను కొందరు వ్యాపారులు అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారు. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉన్న నేపథ్యంలో పట్టపగలు ఇసుక, మట్టిని కొందరు వ్యాపారులు అక్రమంగా తరలిస్తూ తమ దందాను మూడు ఇసుక ట్రాక్టర్లు, ఆరు మట్టి ట్రాక్టర్లుగా కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా వారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పగలే కాకుండా రాత్రివేళల్లోనూ అక్రమ వ్యాపారులు తమ దందాను సాఫిగా కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయాన్ని గండికొడుతూ ప్రకృతి సంపదను దోచుకెళ్తున్న అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జోనల్ కమిటీలు సంఘటితంగా పనిచేయాలి

పాన్‌గల్: బీజేపీ బలోపేతమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో జోనల్ కమిటీలు సంఘటితంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. గురువారం మండలంలోని మాందాపూర్‌లో యువ భరోసా పేరుతో జోనల్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాలను కలిపి నాలుగు జోన్లుగా ఏర్పాటు చేశామని.. ఆయా కమిటీల్లో యువతకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. కమిటీలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప గడపకు వివరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకులు అన్వేష్, జగన్ గుప్తా, వెంకటేష్‌యాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

గోపాల్‌పేట: కొన్ని రోజులుగా మండలంలో వ్యవసాయానికి కేవలం మూడు గంటలకు మించి కరెంటు రావడం లేదని, ఇలా అయితే వరి పంటను ఎలా కాపాడుకోవాలని గురువారం రైతులు చెన్నారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఏఈ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి సమాధానం నినాదాలు చేశారు. ఎంతకూ ఏఈ రాకపోవడంతో సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న బీటీ రోడ్డుపై రైతులు ధర్నాకు దిగారు. గొల్లపల్లి, చీర్కపల్లి, గాంధీనగర్, చెన్నారం గ్రామాల శివార్లలోని రైతులకు కరెంటు తక్కువగా వస్తుండటంతో వరి పంట ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాసేపటి తర్వాత ధర్నా వద్దకు చేరుకున్న ఏఈ శ్రీశైలం శుక్రవారం నుంచి గతంలో లాగే కరెంటు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఎస్ఎఫ్‌యూఐ గోపాల్‌పేట అధ్యక్షుడు జానకీరాం, చీర్కపల్లి ఉప సర్పంచ్ శేషయ్య, భాస్కర్‌రావు, భీమయ్య, మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి



రేమద్దులలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు



అమరచింతలో..

అమరచింత: పట్టణంలోని పోలింగ్ బూత్‌లను అధికారులు గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల వసతులపై హెచ్‌ఎం బలరాంను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో వెంటనే వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఎస్‌ఐ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: శాసనసభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూరర తప్పక పాటించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ వేణు ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీ నేతలకు సూచించారు. గురువారం మండలంలోని రేమద్దులలో వారు పర్యటించి ఫ్లెక్సీలు, గోడలపై రాతల తొలగించే పనులు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలను తప్పక పాటిస్తున్నామని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీ జెండా కట్టల వద్ద గుర్తులకు ముసుగులు కప్పి ఉంచడం, గోడలపై రాసిన రాతలకు రంగులు వేయించినట్లు వారు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మండల అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర నాయకులు

కొత్తకోట: ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ పీఆర్‌టీయూ ఎల్లప్పుడు ముందుంటామని సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వృత్తిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి వారికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామన్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పరశురాం, సహ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రాజవర్ధన్, కార్యదర్శిగా వెంకటేష్ ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు లోకారెడ్డి, ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థినుల ఎంపిక



అమడబాకులలో విద్యార్థి అనూషతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన సాయిశృతి, అనూష రాష్ట్ర స్థాయిలో జరిగి క్రికెట్, కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి తెలిపారు. అండర్–17 క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు సాయిశృతి, అండర్–19 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం తూర్పింటి నరేష్‌కుమార్, నాగరాజు, రాఘవేందర్, సరిత, శర్మ, వైశాలి, ఉస్మాన్, చంద్రశేఖర్, పీఈటీ రాధిక హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి జోనల్ క్రీడా పోటీలు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో తొమ్మిదో జోనల్ క్రీడా పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభకానున్నాయని ప్రిన్సిపాల్ ఆరోగ్యం తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ శుక్ర, శని, ఆది, సోమవారాల్లో క్రీడా పోటీలు జరుగుతాయని, ఎనిమిది జోన్లకు సంబంధించిన గురుకుల పాఠశాలల బాలికలు ఈ పాల్గొనున్నారని చెప్పారు. కార్యక్రమంలో రీజినల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ భాస్కర్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం



అడ్డాకుల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పర్యటించి కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అక్రమాలు చేసి రూ.కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలు అమలు చేస్తుందన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో



తాటిపాముల పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు

ఆత్మకూర్: దసరా పండుగను పురస్కరించుకొని శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు రాష్ట ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్లో విద్యార్థినులు పూలతో బతుకమ్మలను అలంకరించి పాఠశాల ఆవరణలో బొడ్డెమ్మలు వేసి ఆడి పాడారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టీజే విశ్వేశ్వర్ విద్యార్థినులకు నగదు పురస్కారాలను అందజేశారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను రంగు, రంగుల పూలతో అలంకరించి బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను పాఠశాలల విద్యార్థులు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టణ కేంద్రంలో మాంటిస్సోరి ప్లే వే స్కూల్‌లో విద్యార్థులు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. రంగాపూర్‌లో హెచ్‌ఎం జయరాములు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు రకరకాల పూలతో చక్కగా అలంకరించిన బతుకమ్మలను పేర్చి ఉత్సవాలను నిర్వహించారు.

శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలతో విద్యార్థులు ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌గౌడ్, వేణాచారి, గోవర్ధన్ మాధవిలత, రాజు, రవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: దసరా సెలవుల కారణంగా పాఠశాలలకు గురువారం చివరి పనిదినం కావడంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి వాటికి పూజలు చేసిన చిన్నారులు బతుకమ్మలను ఒక్కచోట చేర్చి చిత్తూ చిత్తూల గుమ్మ అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. అప్పారెడ్డిపల్లిలో విద్యార్థులు గునుగు, బంతి, గన్నేరు, తంగేడు తదితర రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి పాటలు పాడుతు బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ ఒకటని హెచ్‌ఎంలు సూర్యసంజీవ, నవీన్ తెలిపారు.



ఖిల్లాఘనపురంలో..



మాందాపూర్‌లో..



ఆత్మకూర్‌లో..



అమరచింతలో..



అప్పారెడ్డిపల్లిలో..

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌కు చెందిన పుట్టపాగ కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం దశదినకర్మ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత–బహుజన సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5,500 ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నరసింహస్వామి, రాధాకృష్ణ, కృష్ణయ్య, అశోక్, రాముడు, జనార్దన్, కృష్ణయ్య, రమేష్, నాగశేషు, స్వామి, శేఖర్, శంకర్, కుర్మయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

మేస్త్రీ కుటుంబానికి..

వనపర్తి మండలం రాజనగరం గ్రామానికి చెందిన మేస్త్రీ వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన ఏళ్లుగా మండలంలోని శాగాపూర్‌లో మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు సర్పంచ్ మౌనికయాదవ్ తమ వంతు సాయంగా గురువారం రూ.2వేల నగదును అందజేశారు. దీంతో పాటు గ్రామస్తులతో చందాల రూపంలో జమ చేసి కొంత నగదును కుటుంబానికి అందజేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తిరుపతియాదవ్, చంద్రయ్య, మల్లేష్‌యాదవ్, సుబ్బయ్యయాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.